# కలలు కరిగిన రోజు

# 2

ఉదయంనించీ లలిత ఒక్క క్షణం విశ్రాంతి తీసుకోలేదు. ఇల్లంతా స్వయంగా చూసుకుని శుభ్రం చేయించింది. పుస్తకాల బీరువా లాటివి ఖాళీచేసి మరీ. డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలకి ఉతికినకవర్లు పెట్టించింది. గోడలన్నీ దులిపించి నిన్నటిదాకా ఎవరూ పట్టించు కోని వస్తువులన్నీ మళ్లీ మళ్లీ శుభ్రం చేయించింది. కార్పెట్ రెండు గంటలసేపు శుభ్రం చేసినా మళ్లీ పంపించి ధూళి వదలగొట్టించింది.

ఇంటికంతటికి కొత్త అందం వచ్చింది—చాలా కాలం తర వాత.

అంతా గమనిస్తూనే ఉన్నాడు ప్రసాద్-చాలా ఆశ్చర్యంతో. ఈ అమ్మాయి ఎవరో కొత్తగా వొచ్చి తన యిల్లు ఆక్రమించి నట్టుం దతనికి. చాలా సార్లు ప్రశ్నలు నోటిచివరిదాకా వొచ్చాయి. ఆశ్చర్యం ఎక్కువైన కొద్దీ, కాని, ఆమె మూడ్స్‌కి భయపడి అక్కడా దూర దూరంనించే అతను విచిత్రం చూస్తున్నాడు.

విచిత్రం—అవును.

లలిత ఆ ఇంటిలో కాలు పెట్టేక ఆమె అది తన ఇల్లని భావించి ఒక్క రోజూ ప్రవర్తించలేదు. సంవత్సరం దాటుతోంది ఆమె కాపురానికివొచ్చి. ఆమె డ్రాయింగ్ రూమ్‌లోకి వొచ్చినది ఐదారుసార్లుకన్న లేదు. అప్పుడు ఆమె గదిలో ఏముందో గమ నించనేలేదు. ఒక సారి తప్ప.

ఆ రోజు ఎవరో అతిధులు వొచ్చారు. సాయంత్రం. అంతకు ముందువారం లలిత తన బలవంతాన తీయించుకున్న ఫొటోకి ఫ్రేమ్ కట్టించి ప్రసాద్ డ్రాయింగ్ రూమ్‌లో పెట్టి ఉంచాడు. ఆ రోజు పిక్నిక్‌లో మంచి ఉషారుగా ఉంది లలిత. పిక్చర్‌లో చాలా అం

దంగా వొచ్చింది. దాన్ని ఎంతో మెచ్చుకుని ప్రసాద్ ఫ్రేమ్ చేయించాడు.

వొస్తూనే అతిథులు ఆమె పిక్చర్‌ని గమనించి ఎంతో మెచ్చుకున్నారు. అది లలితకి ఇంకా పెళ్లికాక మునపటిదని వాళ్ళను కున్నారు ...కాని, గర్వంతో ప్రసాద్ వాళ్ళకి నిజం చెప్పేడు. నిజంగానే లలిత ఆఫొటోలో ఎంతో అందంగా ఉంది. ఆమె పక్క నిల బడ చిన్న అమ్మాయి ఆమె చెల్లెల్లాగ వుంది. ఆ మాటా ప్రసాదే అన్నాడు.

అతని మాట లెందుకో లలితకి కొంత కోపం తెప్పించిన మాట అతను త్వరగానే గ్రహించాడు. ముందర ఆమె ఎదుట ఆమెని పొగడడంవల్ల ననుకున్నాడు కాని, మళ్లీ ఆమె తనవించి ఎంత దూరంగానో ఉండిపోయిన మాట జ్ఞాపకం వొచ్చి నిత్య జీవితంలో తాను భరిస్తోన్న వెయ్యి చిరుబాధల్లో ఇదొకటి అనుకని సమాధాన పడ్డాడు.

ఆ సాయంత్రం—అత నెంతో సంతోషంతో ఎదురు చూసిన ఆ సాయంత్రం—నిర్జీవంగా గడిచింది. మళ్లీ ఆ మిత్రుని కుటుంబం తన ఇంటికి రాలేదు.

వాళ్ళు వెళ్లిపోయాక ఆమె ఏమీ అనలేదు—అతనూ నేరం చేసిన వాడిలాగ ఏమీ అనలేక పోయాడు....ఆమె మీద అతనికున్న అభిమానం అతన్నే నేరస్థుడిగా, ఆమెనే బాధితగా చేసింది.

మర్నాడు ఆ ఫొటో ఆమె తీసి దాచింది. ఈ రోజు ఆ ఫొటో మళ్లీ డ్రాయింగ్ రూమ్‌లో కనిపించింది.

"కేక్స్ తెప్పించారా?"

ఆలోచిస్తూన్న ప్రసాద్ తల ఎత్తి, 'ఆఁ—' అన్నాడు.

'స్వీట్సు?'

'వస్తాయి'

'రిజెంట్ పార్క్ షాపువించేనా?'

"అవును—ఏమిటి విశేషం లలితా?"

రేడియో గ్రామ్‌లో రికార్డులు పరీక్షిస్తూన్న లలిత ఆగి, "ఇవేళ నా పుట్టినరోజు" అంది.

ఆశ్చర్యంగా చూశాడు ప్రసాద్. అతనా సంగతి మరిచి పోయాడు. నిజానికి కిందటి సంవత్సరం—తమ సహజీవనంలో మొదటి సంవత్సరం—ఆమె పుట్టింటికి వెళ్ళింది ఈ రోజుల్లో. తన ఇంట్లో ఆమె జన్మదినం రావడం ఇదే మొదటి సారి. ఆమె నొచ్చు కుందా, తన మరుపుచూసి? కాని, ఆమె చేస్తోన్నదేమిటి?

"సారీ....నాకు జ్ఞాపకమే లేకపోయింది!" అన్నాడు నిజ మైన పశ్చాత్తాపంతో ప్రసాద్. "పోనీలే!—అయినా మించి పోలేదు. నీకు పార్టీ—"

"అదేమీ వొద్దు" అంది లలిత.

ఎంతో తొందరగా అతని మాటల్ని తుంచివేస్తూ అన్న ఆమె మాటలు అతనికి హఠాత్తుగా ముళ్లు గుచ్చుకున్నట్టు బాధ కలిగించేయి. కాని—అతనికి కోపం రాలేదు. ఆమెకోసం అతని ఆరాధన ఆమె తప్పుని క్షమించి, తన తప్పుని పదింతలు చేయించింది.

కాని, మరుక్షణం, "కాని, ఈ రోజు మీరు నా కిచ్చే బహు మానం ఉంది" అన్న లలిత మాటలు అతని కెంతో చైతన్యం తెప్పించాయి.

'ఏమిటి? చెప్పు' అన్నాడు.

'సాయంత్రం మీరు క్లబ్‌కి వెడుతున్నారా?'

'ఆ—ఇవేళ టెన్నిస్ డబుల్స్ మేచ్ ఉంది....కాని—'

'వెళ్ళండి. తొమ్మిదికి వస్తారా?'

'ఆ....కాని, ఏదుకి—'

'అవసరం లేదు—రావొద్దు'

ఆతురతగా ఆమె అన్నమాటలకి ఆశ్చర్యపడుతూ "ఏం లలితా?"

చిరునవ్వుతో, 'అదే బర్త్‌డే ప్రెజెంట్... మీరేమీ అడగ కూడదు-అంటే మీనించి దాచే రహస్యం ఏమీలేదు....' అంది లలిత.

'నా కేమీ చెప్పనక్కరలేదు-నీ ఇష్టం;' అన్నాడు ప్రసాద్ తొందరగా.

"రహస్యం కాదన్నానుగా!....నాతో యూనివర్శిటీలో చదువు కున్న ఇద్దరు క్లాస్‌మేట్స్ రాత్రి డిన్నర్‌కి వొస్తున్నారు—అందుకని ఇలాగే బాగుంటుంది.'

'అవును' అన్నాడు ప్రసాద్, లేని ఆనందం తెచ్చుకుంటూ.

ఆ తరవాత ప్రసాద్ తయారై క్లబ్‌కి వెళ్ళిపోయాడు. గేమ్ మొదలు పెట్టేదాకా, లలిత అతన్ని ఆలోచనల్లో చాలా బాధించింది-అది కొత్త ఏమీకాదు.

అతనికి బాగా జ్ఞాపకం. లండన్‌నించి తిరిగి రాగానే, తనకి ఇక్కడ అనుకున్న కన్న మంచి ఉద్యోగం దొరికింది. కాని, మళ్ళీ లండన్ వెళ్ళిపోదామని అతనికి ఆలోచన ఉండేది. ఏదీ తేలేలోపున తన వాళ్ళని చూసివద్దామని వాల్తేరు వెళ్లేడు.

అక్కడ చాలా ఆశ్చర్యంగా కలిసింది లలిత. ఒకనాడు పాత స్నేహితుడితో కలిసి బీచ్‌కి వెడితే. అక్కడ లలిత తన స్నేహితులతో వొచ్చి, తాము కూర్చున్న చోటికే వచ్చింది. ఆమె తన స్నేహితుడికి చాలా దగ్గర చుట్టంట. అతన్ని ముందర చూసి, ఆమె పలకరించింది.

అతను ప్రసాద్‌ని పరిచయంచేశాడు.

ఆ నిమిషం ఎంత శుభముహూర్తమో కాని, మిగిలిన విషయాలు చాలా త్వరగా జరిగిపోయాయి. లలిత వెళ్ళగానే, 'ఏం ప్రసాద్? ఆ అమ్మాయి ఎలాగఉంది?' అని అడిగాడు స్నేహితుడు.

'చాలా బాగుంది' అన్నాడు తాను.

ఆ మరునాడే ఆమె తల్లిదండ్రులని తాను కలుసుకునే, ఏర్పాటు జరిగిపోయింది. తనని వివాహం చేసుకునేందు కామె సుముఖంగా ఉందనీ, తనకిష్టమైతే వెంటనే మిగిలిన లాంఛనాలు పూర్తిచేద్దామనీ స్నేహితుడు చెప్పగానే, తన కెంత సంతోషం వేసింది!

లలిత తరపున వినవచ్చిన షరతు-తా నిక్కడే, అంటే భారతదేశంలోనే ఉద్యోగం చెయ్యాలని-సులభంగానే అంగీకరించాడు తాను. ఆ తరువాత అన్నీ నిర్ణయం అయేముందు లలితని తను కలుసుకుని, ఆమెని అడిగినప్పుడు, "అందరూ నిర్ణయించేరుగా! నన్నడిగేదేముంది?" అన్న ఆమె మాటలు విని ముందర ఆశ్చర్యపడినా, తరువాత ఆమెకి విముఖత ఏమీలేదని ఆమె స్వయానా చెప్పింది....అమ్మాయి కదా? అంతకన్న క్లియర్‌గా ఎలాగ చెప్తుంది? అనుకుని తనని తాను సమాధాన పరచుకున్నాడు.

కాని, ఆమెనించి తాను ఆశించిన ఆత్మీయత, అనురాగం తనకి ప్రాప్తికాలేదు. తనకి ప్రత్యేకం ఏమీ లోపం ఆమెలో కనిపించక పోయినా, నిర్జీవంగా ఆ ఉనికి, నిర్లిప్తత దూర దూరంగా ఆమె జీవించడం—అన్నీ తనకి ఎంతో బాధాకరంగా పరిణమించాయి.

ఎందుకని?

లలిత మనసారా తన నెందుకు ప్రేమించలేక పోతోంది?

అతనికి సరియైన సమాధానం ఎప్పుడూ రాలేదు. ఇదొక తెగని సమస్యగా ఉండి పోయింది. కాని, అంతరాంతరాల కలలలో అతనికో కల. రానున్న దేదో ఒక రోజు తమ మధ్యనున్న దూరాన్నంతనీ మాయంచేసి, లలిత తనకి దగ్గరగా వొచ్చేసి, తనని కౌగిలించుకుని వ్యర్థమై పోయిన ఈ కాలంకోసం కన్నీరు కారుస్తుందని.

అది కల—అతనిది.

ఏడు గంటలకి ఐదు నిమిషా లుండగానే ప్రకాశ్ వొచ్చాడు. మరి రెండు నిమిషాల్లో శ్రీధర్ వచ్చేడు. లలిత డ్రాయింగ్ రూమ్ లోకి వొచ్చేసరికి వాళ్లిద్దరూ అనుకోని తమ సమాగమానికి ఆశ్చర్యపోతున్నారు.

'అరే! శ్రీధర్! నువ్వెలాగ వొచ్చా విక్కడికి?'

'నువ్వెలాగ వొచ్చావు?'

'లలితకి టెలిఫోన్ చేస్తే డిన్నర్‌కి రమ్మంది. నేను కల కత్తా వొచ్చి వారం ఐంది, రీజినల్ కాన్ఫరెన్స్....'

'నేను మొన్ననే వొచ్చాను—లైసెన్స్ గొడవల్లో, నేనూ టెలిఫోన్ చేస్తే....'

'కోఇన్సిడెన్స్!'

'వండర్‌ఫుల్'

'సునీతి అలాగే అంటుందిలే—మంచి విషయాలన్నీ అనుకో కుండానే అవుతాయని....'

'రాధ అట్నుంచి ఇటు!....మనకి నచ్చినివి మాత్రం అనుకో కుండా అవుతాయంటుంది!'

'మీ ఆవిడ పెసిమిస్టు!'

'మీ ఆవిడ ఆప్టిమిస్టు!'

సుమారు రెండు నిమిషాలు గుమ్మంలో నిలిచి, పాతమిత్రుల ఆగమనం కోసం నిరీక్షిస్తూన్న లలితకి ఈ పరస్పర తత్వవాదన అంతుకి వచ్చేలాగ కనిపించలేదు. తనకోసం ఆతురతతో ఎదురు చూస్తూ ఉంటారని అనుకున్న లలితకి ఈ విషయం ఆశాభంగం కలిగించినా, అనుకోకుండా చాలా సంవత్సరాల కిందటి మిత్రులు ఇలా కలుసుకున్నాక ఆ పరిస్థితి క్షంతవ్యంగానే కనిపించింది.

'హల్లో ప్రకాశ్, శ్రీధర్!'

ఆమె కంఠస్వరం విని, ఆశ్చర్యపడ్డట్టు ఇద్దరుమిత్రులూ ఆమె వైపు తిరిగారు.

'హల్లో!' అన్నారు కొంచెం ప్రయత్నించి మాట్లాడు తోన్నట్టు.

ఎంతో శ్రద్ధతో అలంకరించుకున్న లలితకి వాళ్ళ ముఖాల్లోని ఆశ్చర్యం సంతృప్తిని కలిగించింది. యూనివర్శిటీలో తనికి 'మిస్ వర్శిటీ' అనీ, 'క్వీన్ ఆఫ్ ఏప్రిల్' అనీ, అలాటివే ఇతర బిరుదులూ కారణంలేకుండా ఇవ్వలేదు. తన ప్రశంసకులలో చాలా ముఖ్య మైన వాళ్ళు వీరిద్దరూ.

'కూర్చోండి....'

నిశ్శబ్దంగా అందరూ కూర్చున్నారు. తిరిగి సంభాషణ ఎలాగ ప్రారంభించాలో తెలియక, ఒకటి రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

'ప్రకాశ్ గ్రామ్‌మీద ఉన్న లలిత ఫొటో చూస్తూ, "చాలా ఛార్మింగ్‌గా ఉంది....ఎక్కడ తీసేరు?' అని అడిగాడు.

'పిక్నిక్‌కు వెళ్ళాం అరకువేలీకి....'

'లవ్లీగా ఉంది....' అన్నాడు శ్రీధర్. బొమ్మని పరీక్షగా చూస్తూ. 'రాధకూడా అలాగే....ఎప్పుడు పిక్చర్ తీసుకున్నా, చిన్న పిల్లని పక్కన ఉంచుకుంటుంది.'

'సునీతకి పిక్చర్స్ తీసుకోడం అంటె బలే సరదా!....అ మధ్య త్రివేంద్రం వెళ్ళినప్పుడు జూలో 'పిక్చర్స్ తియ్యమంది. టైగర్స్ బేక్ గ్రౌండ్‌తో....నాకా ఐడియా రానేలేదు! చాలా బ్యూటిఫుల్‌గా వొచ్చింది పిక్చర్స్' అన్నాడు ప్రకాశ్.

'రాధది చాలా ఫోటోజెనిక్ ఫేస్—పెళ్ళిముందు వాళ్ళ అంకుల్ ఒకసారి స్క్రీన్ టెస్ట్ చేయించారుట. ఆయన చెప్పేరు. డాక్యుమెంటరీ డివిజన్‌లో ఫోటోగ్రాఫర్ లే'

'సునీతికి లక్స్‌వాళ్ళు ఆఫర్ చేద్దామనుకున్నారు. పబ్లిసిటీ ఫోటోస్‌కి....కొంచెం పాత కాలపు వాళ్ళు కావడాన్ని వొద్దన్నారుట. ఆమె స్వయంగా నాతో చెప్పింది.'

కొంచెం నీరసంగా లలిత కలుగజేసుకుని, 'శ్రీధర్! జ్ఞాపకం ఉందా, యూనివర్శిటీలో ఎంత బాగుండేదో! ప్రకాశ్, నువ్వూ, నేనూ ఒకసారి పిక్నిక్‌లో పాటలు పాడేం. జ్ఞాపకం ఉందా?' అని అడిగింది.

మిత్రులిద్దరూ నేరం చేసినట్టు ఆగిపోయి, ఒకరి ముఖం ఇంకొకరు చూసుకుని, లలితవైపు తిరిగారు.

'అవును....సింహాచలం కాదూ?....బాగా జ్ఞాపకం ఉంది' అన్నాడు శ్రీధర్.

'చాలా ఏంజాయ్‌చేశాం కాదూ? ఫోర్త్‌ియర్ తనక పరీక్షల భయం ఉండేది కాదు. మన లెక్చరర్ కరుణాకరం జారిపడి,కాలు విరిగి పోయిందని గోల... అమ్మాయిలంతా ఒకటే నవ్వు!' అన్నాడు ప్రకాశ్.

"విచిత్రం ఏమిటో తెలుసా ...ఆ పిక్నిక్ నాకు అలా జ్ఞాపకం ఉండిపోయింది—మన సీనియర్ అరుణ కూడా ఆ వేళ వొచ్చింది జ్ఞాపకం ఉందా? అక్కడ పిక్చర్ పెయింట్ చేసింది. ఎందుకో నా సలహా అడిగింది!"

ప్రకాశ్ కళ్ళు మూసుకుని, ఆలోచిస్తూన్నట్టు కూర్చుని ఏమీ అనలేదు.

లలిత కూడా ఏమీ అనలేదు—అనేది ఏదీ లేదన్నట్టు.

"రాధకి నన్ను గురించి మొట్టమొదట చెప్పింది అరుణట... ఆవిడ నన్నుగురించి రాధని చాలా ఇంప్రెస్ చేసింది!"

"అదే. అనుకోకుండా కలిపిరావడం!" అన్నాడు ప్రకాశ్.

ఏదో అనబోతూన్న శ్రీధర్‌కి అడ్డు వొస్తూ లలిత. "ఆ రోజు నువ్వు పాడిన పాట జ్ఞాపకం ఉందా?" అని అడిగింది.

ఆ ప్రశ్న వెనుక చాలా జ్ఞాపకాలూ, ఎన్నో నిట్టూర్పులూ ఉన్నాయి. ఆ రోజు శ్రీధర్ ఎప్పటికన్నా ఎక్కువగా తన వెంట తిరగడం, మాటి మాటికీ, ఎంత అనవసరమైనా కల్పించుకుని తనతో మాట్లాడడం, ఆమెకి జ్ఞాపకం ఉంది. నిజానికి, తరవాత తమ సన్నిహిత స్నేహానికీ, ప్రణయం అంచుల దాకా వొచ్చిన మమతలకీ ఆ రోజు పునాది అన్న విషయం ఆమె ఎప్పుడూ మరిచిపోలేదు.

శ్రీధర్ కొంచెం ఆలోచించి, "నాకు జ్ఞాపకంలేదు లలితా! చాలా కాలం ఐపోయింది!" అన్నాడు.

లలిత ఆ జవాబు నమ్మలేదు.

ఆనాడు ఎంతో భావయుక్తంగా, తన కళ్ళల్లోకే చూస్తూ, శ్రీధర్—

ఓ....హృదయరాణీ

నిను స్మరించి స్మరించి కుమిలిపోదునా?



[library stamp]

పరితపించి తపించి

కానలేకా, రాలిపోదునా!

అని పాడడం ఆమె ఏ రోజు జ్ఞాపకం తెచ్చుకుని అతని కోసం నిట్టూర్పు విడువలేదు?

బహుశా, దూరమైపోయిన తమ జీవితాల మధ్య అప్పటి మధురభావన కూడా ఊహించే విషయం అవుతుందనే చక్కటి భయం అతనిచేత అబద్ధం ఆడిస్తూందని అనుకుంది లలిత. తన కోసం తపించి, మేలుకొనీ, నిద్రలోనూ, తన కలలేకన్న శ్రీధర్ ఆ రోజు ఎలాగ మరిచిపోతాడు? ప్రకాశ్ తరువాత రోజుల్లో తనకంత దగ్గరగా వొచ్చి ఉండకపోతే, శ్రీధర్ ఎవరో అమ్మాయిని ఎందుకు పెళ్లిచేసుకుని ఉండే వాడు? అతనికి ఇష్టం లేకపోయినా, పెద్దవాళ్లు అతనికి బలవంతాన పెళ్లిచేసినమాట ఎవరూ ఆమెకి చెప్పనక్కర లేదు....పరిస్థితులకి తలవొంచినా, ఆ జ్ఞాపకాల తనెలాగ విస్మరిస్తాడు! అతనా గేయాన్నే మరిచిపోయాడంటే దానికి కారణం ఈ రోజు ఈ స్థితిలో తనని చూసిన అశాంతి తప్ప ఏం అయి ఉంటుంది?

"ఎలాగ మరిచిపోతావు శ్రీధర్?" అంది లలిత ఈ ఆలోచనల క్షణాన్ని వెనక్కినెట్టుతూ.

"నాకు జ్ఞాపకం లేదు లలితా?"

"నాకు జ్ఞాపకం ఉంది....ఆ గేయం ఎవరు రాశారో కాని... హృదయరాణీ....విను స్మరించి స్మరించి .. ఆమె రాగ యుక్తంగా పాడబోయింది. లలితది శ్రావ్యమైన కంఠం.

"రాధకి ఈ తేలిక గేయా లంటే పడదు. ఆమెకి త్యాగరాజ కీర్తనలూ, దీక్షితార్, ముత్తుస్వామి .. వీళ్ళందరి రచనలూ అంటే ఎంతో గౌరవం. వాటి టేపు లెన్నో ఉన్నాయి మా ఇంటో" అన్నాడు శ్రీధర్, ప్రకాశ్‌తో.

లలిత సంగీతం అసంపూర్ణంగానే ఉండిపోయింది.

"సునీతికి కర్ణాటకం అంటే అట్టే పడదు. ముఖ్యంగా, గాత్రసంగీతం. ఆమెకి జాజ్ అంటే చాలా చాలా ఇష్టం....మా రికార్డ్ రేక్ నిండా, జాజ్ రికార్డులే." అన్నాడు ప్రకాశ్.

"రాధకి బీథోవెన్ సింఫోనీలంటే చాలా ఇష్టం! ఒక సారి మద్రాసునించి ప్రోగ్రాం వాస్తే అంతా రికార్డుచేసి పెట్టింది...."

"సునీతి అలాగే! బిస్మిల్లాఖాన్ షహనాయ్ అంటే అన్నీ మరిచి పోయి వింటుంది!....జులైలో నేషనల్ ప్రోగ్రామ్ వాస్తే ఇంట్లో టేప్ రికార్డర్ లేదని ఎంతో విచారించింది. మర్నాడు నాలుగు ఎల్. పి. లు కొని తెచ్చేదాకా ఆమెకి సంతృప్తి లేకపోయింది!" అన్నాడు ప్రకాశ్, ఆ జ్ఞప్తి తెచ్చిన చిన్న విషాదాన్ని దాచుకో లేకుండానే.

లలిత మళ్ళీ సంభాషణలోకి వొస్తూ, "ప్రకాశ్! మనం ఎలాగ కలుసుకున్నామో జ్ఞాపకం ఉందా?" అంది. తనని బాధించ కుండా ఉండాలని వాళ్ళిద్దరూ ప్రయత్నిస్తున్నారనే నమ్మకం ఆమె పోగొట్టుకోలేక పోయింది.

అర్థం కానట్టు చూశాడు ప్రకాశ్.

"నువ్వు మరిచిపోయానంటే నమ్మను....నేను జ్ఞాపకం చేసేదా?" అంది, చిరునవ్వుతో, లలిత. ఆ సమాగమం అత నెలాగ విస్మరించ గలదని?....అతను ఫిఫ్త్ యియర్‌లో చేరిన నెన్నాళ్ళకి....

'నేను సిటీ బస్‌కోసం వొస్తూంటే హఠాత్తుగా వర్షం వొచ్చింది. ఆ రోజు కారు రాలేదు ఎందుకనో—నువ్వు ఒక్కడివే గొడుగు పట్టుకుని వచ్చావు—నన్ను రక్షించడానికిలాగ!'

పోయిన వస్తువు దొరికిన సంతోషంతో, 'ఊఁ! అవును. లలితా! జ్ఞాపకం వొచ్చింది. ఎలాగ మరిచిపోగలనని? —ఎందుకో తెలుసా,' అన్నాడు ఉత్సాహంతో ప్రకాశ్.

'ఎందుకని?' అని అడిగింది. ఆ మొదటి వర్షపురోజు అతని కెందుకు జ్ఞాపకం ఉందో తనకి తెలియనట్టు! "నువ్వు ఎంత అం దంగా ఉన్నావంటే లలితా! జీవితం అంతా నీ సాన్నిధ్యంలో గడప లేకపోతే ఆత్మ హత్య చేసుకుంటాను" అని ప్రకాశ్ రాసేరోజుకి నాంది అయిన ఆ వర్షపురోజు!

'ఆ సాయంత్రం. సునీతి డిపార్ట్‌మెంటు నించి వొస్తూ నన్ను చూపి నవ్వుకుందిట!—తన స్నేహితురాళ్ళతో. అదుగో కొత్త వాల్టర్ రేలీ! అని కూడా అందిట, విచిత్రంగా లేదూ?' అన్నాడు ప్రకాశ్.

ఈ సారి ముఖం చిట్లించకుండా ఉండలేక పోయింది లలిత. వాళ్ళమీద తాను పెట్టుకున్న ఆశలు కన్న కలలు వాస్తవం అనే నమ్మిక కొంచెం కొంచెం తగ్గడం ప్రారంభించింది—ఆమెకి తెలియకుండానే.

కాని ఆమెని గమనించే స్థితిలో లేడు ప్రకాశ్—అతను సునీతి సెన్స్ ఆఫ్ హ్యూమర్ గురించి పది నిముషాలు చెప్పేడు శ్రీధర్‌కి.

శ్రీధర్ జవాబు ఇవ్వబోయేలోపున లలితకి ఓర్పు చాలా తగ్గిపోయింది. కాని, ఆ మిత్రుల దృష్టి తిరిగి తన మీదికి ఎలాగ తిప్పాలో ఆమెకి బోధపడలేదు. సరీగా ఆ సమయానికి భోజనం తయారైనట్టు సర్వెంటు వచ్చి చెప్పడం ఆమెకి చాలా సహాయం చేసింది.

భోజనానికి కూర్చునేదాకా ప్రకాశ్, శ్రీధర్, తమ తమ భాగస్వామినులని గురించి మాట్లాడుతూనే ఉన్నారు. చివరికి తన నమ్మకాలని గురించి మరీ సందేహం ఎక్కువ కాసాగింది. తాను ఇన్నాళ్లూ ఊహాలోకాల్లోనే విహరించిందా?

నీరసంగా, అలాగ కాదని తనకి తానే జవాబు చెప్పుకుంది... నమ్మిక లేకుండానే, ఆ రోజుల్లో తన కోసం వీ రిద్దరూ ఎంతో తహతహలాడేరు విపరీత కారణాలవల్ల తనని వారిలో ఎవ్వరూ వివాహం చేసుకో లేదు.... అందు కని వాళ్లు ఎంతో పరితపిస్తూ ఉంటారు. తన మాట ఏమైంది? వీ రిద్దరిలో తనకి ఎవ్వరూ కాదని తెలిశాక ప్రసాద్‌తో వివాహానికి తల్లిదండ్రుల ఒత్తడితో తాను అంగీకరించింది. కాని, జరిగిన ఈ మధుర సంఘటనలనీ, తన కోసం తహతహలాడే ఈ సన్నిహిత మిత్రులనీ ఎలాగ మరిచిపోతుంది? ఈ

కలల జ్ఞాపకాలు తమ మధ్యన ఎంతో దూరాన్ని సృష్టించేక, తాను ప్రసాద్ ని తన హృదయానికి దగ్గరగా ఎలాగ తీసుకుంటుంది?

"సాంబార్ అంటే మరీకోపం రాధకి!" అని శ్రీధర్ కొంచెం గట్టిగా అన్నమాటలకి ఆలోచనలనించి వాస్తవానికి వచ్చింది.

"సునీత అంతే....కారం అనేది దగ్గరకి రానివ్వదు—కాంప్లెక్షన్ పాడౌతుందట" అన్నాడు ప్రకాశ్.

"ఆ మధ్య రాధ డయటింగ్ ప్రారంభించింది. ఎవరో ఆమె రెండు కేజీల బరువు ఎక్కువ అన్నారుట. ఇరవై రోజులు భోజనాలు ఉపవాస ప్రాయం ఐపోయాయి. హోటల్ చూపినప్పు డల్లా అంతరంగంతో పెద్దయుద్ధం ఐపోయింది! చివరికి ఓడిపోలే దులే!"

'సునీతి అలాగే!.... నా కోసం ప్రాణం ఇచ్చినా, తనని మోసగిస్తే మాత్రం సహించదు. అలాటిదేమీ ప్రయత్నించే ఉద్దే శం లేదనుకో.'

"రాధ మామూలుగా. పాపం, చాలా సహిస్తుందిలే. ఒక్కొక్కసారి నేను ఆఫీసునించి ఇంటికి వచ్చేసరికి పది, పది హేను నిమిషాలు లేటు ఐనాసరే. అట్టేకోపం వొచ్చేది కాదు ... కాని."

"సునీతి పది నిముషాలైతే"

"ఈ మధ్య రాధ—అంటే...."

"నువ్వనేది - మీరిద్దరు!"

"అదే జనాభా...."

"ఓహ్! చూశావా? మరో కోఇన్సిడెన్స్"

"నివ్వనేది...."

"అదే! చాలా విచిత్రంగా ఉంది కాదూ?"

"ఆఁ అవును. అద్భుతంగా ఉంది!"

"మనం సిలబ్రేట్ చెయ్యాలి!"

"పద - ప్రిన్స్‌స్‌లో—"

"అక్కడ ఫ్లోర్‌షో ఉంటుందేమో!"

"అవును. అదీగాక విస్కీ అంటే రాధకి చాలా అసహ్యం...."

"నిజానికి సునీతీ అంతే...."

లలితకి కళ్ళనీటి పర్యంతం ఐనా, ఆమె కష్టంతో భోజనా లయేదాకా ఎలాగో తన భావాలని అరికట్టుకుంది. మళ్ళీ ముగ్గురూ డ్రాయింగ్ రూమ్‌లోకి వొచ్చేసరికి సరీగా తొమ్మిదైంది.

"చాలా థాంక్స్ లలితా!....మరి వెళ్ళాలి" అన్నాడు ప్రకాశ్ కూర్చొకుండానే.

"ఎంతో అద్భుతంగా ఉంది ఈ రోజు! చాలా శ్రమపడ్డందుకు కృతజ్ఞత. నేనూ వెడతాను" అన్నాడు శ్రీధర్.

రిలీఫ్ ముఖంలో కనిపించనీయకుండా, లలిత లాంఛనంగా, అప్పుడేనా? ఇంకా తొమ్మిదేఐంది!" అంది.

"హోటల్ చేరుకునేసరికి మరో అరగంట. పదికల్లా నిద్రపోవడం అలవాటు" అన్నాడు ప్రకాశ్.

"రాధకి ఉత్తరం రాయాలి...." అన్నాడు శ్రీధర్

మళ్ళీ గుడ్‌నైట్ చెప్పి ఇద్దరూ త్వర త్వరగా వెళ్ళిపోయారు.

గది మధ్య నిలబడి చుట్టూ కలియజూసింది లలిత. రెండు గంటలనించీ అనుభవించిన అవమానం తరువాత ఆమె కన్నీళ్ళు ఆపుకోలేకపోయింది. ఆ తడి తెరలోనుంచి ఆమె చుట్టూ కలల శకలాలు కనిపించాయి—తన మనస్సులో తానే నిర్మించుకున్న తన స్వప్న సౌధాలు కూలిపోయిన శిథిలాలలాగ.

లోపలికి వచ్చిన ప్రసాద్‌ని ఆమె గమనించ లేదు. కాని, "ఏం లలితా అలాగ ఉన్నావు?" అని అతను లాలనగా అడిగేసరికి ఒక్కసారిగా వొచ్చిన దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. కలలనించి

వా_స్తవానికి రావడం కష్టం అన్నట్లు, దాని కతని సహాయం ఎంతో కావల్సినట్టూ ఆమె ఉద్వేగాతిరేకంతో అతన్ని గాఢంగా కౌగిలించు కుంది.

హఠాత్తుగా ఒనగూడిన ఈ రమణీయమైన సన్ని వేశానికి ఎంతో ఆశ్చర్యపోయాడు ప్రసాద్. కాని మధురాను భూతులు అనుభవించడానికేగాని ఆద్యంతాలు ప్రశ్నించడానికి కావని అతనికి తెలుసును. అందుకే, అతను అనవసరమైన సంభాషణలో కాలం వృథాచెయ్యలేదు.

—o—